www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -159 బుధవారం 23 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..

యూపీఐ ఎండీఆర్‌పై జీఎస్టీ భారం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవం

రూ.2,000 లోపు లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు, జీఎస్టీ ఉండదని స్పష్టీకరణ

నెలకి లక్ష లోపు యూపీఐ వసూళ్లున్న వ్యాపారులపై ప్రభావం శూన్యమని వెల్లడి

వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు యథాతథంగా పూర్తిగా ఉచితమని స్పష్టత

చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద సర్దుబాటు చేసుకోవచ్చన్న ఎన్‌పీసీఐ

## ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు
# సత్వర న్యాయం

గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల

వెంటనే నష్ట పరిహారం చెల్లింపు

రెగ్యులర్ గా జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు

:రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్(ప్రజావినికిడి):**
ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఈ సందర్భంగా సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పని తీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. మిగతా 2లో...

## ఆసియా క్రీడలు 2026లో
# భారత్‌కు తొలి స్వర్ణం



మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో విజయం

దేశం గర్విస్తోందంటూ జట్టును అభినందించిన ప్రధాని మోదీ

చారిత్రక విజయమంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంస

**ఢిల్లీ సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మిగతా 2లో...

## వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

తెలుగు చిత్రాలకు 9 అవార్డులు



**ఢిల్లీ సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజరాత్‌లో అవార్డు ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు సినీకళాకారులు పురస్కారాలు అందుకున్నారు. మిగతా 2లో...

## వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

మతపరమైన, మనస్సాక్షికి సంబంధించిన అభ్యంతరాలకు రక్షణ

జాతీయ గీతంగా వందేమాతరం హోదాను ప్రశ్నించలేమని స్పష్టీకరణ

గాయకుడు టీఎం కృష్ణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ సెప్టెంబర్ 2(ప్రజావినికిడి):**
వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని మిగతా 2లో...



## 4 జిల్లాలకు వరదముప్పు

భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో కుంభవృష్టి

భారత వాతావరణ శాఖ హెచ్చరిక

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

నేటి రాత్రి తీరం దాటే అవకాశం

**హైదరాబాద్ (ప్రజావినికిడి):**
బంగాళాఖాతంలో వాయుగుండం మంగళవారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలపడింది. దీంతో తెలంగాణలోని నాలుగు జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉంద ని భారత వాతావరణశాఖ(ఐఎండీ) హెచ్చరించింది. భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మిగతా 2లో...



## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్




నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు

రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు

హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం

బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు

20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను మిగతా 2లో...

## 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

టీచర్లపై వైసీపీ దాడులు.. జోగి రమేశ్, వెల్లంపల్లి, దేవినేని అవినాశ్ తదితరులపై కేసులు



**విజయవాడ సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం ఎదుట టీచర్లపై వైసీపీ నాయకులు, శ్రేణులు జరిపిన భౌతిక దాడి ఉదంతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. 2లో...

## జూరాలకు నీళ్లివ్వండి..



కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్

శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం

బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ

విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి

జూరాల నీటి కోసం రైతుల ఆందోళన

**హైదరాబాద్(ప్రజావినికిడి):**
ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. 2లో...

## ఏసీ పేలి ముగ్గురు నవజాత
# శిశువులు మృతి

ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం24 మందికి అస్వస్థత .

.ప్రయివేటు ఆస్పత్రులకు తరలింపు -విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఆస్పత్రిని సందర్శించినవైద్యారోగ్య శాఖ మంత్రి



**ఆదిలాబాద్ (ప్రజావినికిడి):**
ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి కండ్లు కూడా సరిగా తెరవని నవజాత శిశువులు చికిత్స పొందుతున్న ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. మిగతా 2లో...

## ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు తొలి స్వర్ణం

మొదటిపేజీ తరువాయి

ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

## జూరాలకు నీళ్లివ్వండి..

మొదటిపేజీ తరువాయి

మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు.జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.



రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.

అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు.జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

మొదటిపేజీ తరువాయి

పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది.ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, "వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది, దాని హోదాను మేము ప్రశ్నించలేము" అని వ్యాఖ్యానించింది. అయితే, ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది.

1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో, మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

## వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు.మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను, భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని ఈ అవార్డు వరించింది. కల్కి 2898 ఏడీ ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఆ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమాలు కూడా సత్తా చాటాయి. 'కల్కి 2898'తో పాటు 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'పుష్ప-2', 'లక్కీ భాస్కర్' సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకున్నాయి.చలనచిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం సాధారణంగా ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. 1954 నుంచి ఈ వేదికగానే అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో ఓసారి మాత్రమే చెన్నైలో జరిగింది. ఇక కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.

## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు.ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

## 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

మొదటిపేజీ తరువాయి

సమాజానికి దిశానిర్దేశం చేసే గురువులపై దౌర్జన్యాలు, భౌతిక దాడులు చేయడాన్ని ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు.దీనిపై వేగంగా స్పందించిన పోలీసులు విజయవాడలోని సూర్యారావుపేట, మాచవరం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కలిపి మొత్తం 6 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 250 మందికి పైగా వైసీపీ నాయకులు, శ్రేణులు, రౌడీషీటర్లపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, చట్టవిరుద్ధంగా గుమిగూడటం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో మాజీ మంత్రులు జోగి రమేశ్, వెల్లంపల్లి శ్రీనివాస్, నేతలు జక్కంపూడి రాజా, దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ తదితరులు ఉన్నారు.

మరోవైపు వైపు, వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు రవిచంద్రను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడిలో పాల్గొన్న పలువురు రౌడీషీటర్లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

# చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

**యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..**

**ఢిల్లీ సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చేసే చెల్లింపుల్లో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) పై జీఎస్టీ విధిస్తారని, దీనివల్ల డిజిటల్ చెల్లింపులు ఖరీదుగా మారతాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులపై భారం పడుతుందని కొన్ని మీడియా మాధ్యమాలలో వస్తున్న వార్తలను 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) ఖండించింది. ఈ ఆందోళనలు పూర్తిగా అవాస్తవమని, అపోహలు మాత్రమేనని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఎన్‌పీసీఐ వివరణ ప్రకారం, ఎండీఆర్ అనేది కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. రూ.2,000 వరకు జరిపే లావాదేవీలకు ఎలాంటి ఎండీఆర్ లేనందున, వాటిపై జీఎస్టీ ప్రభావం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీల్లో 96% పైగా రూ.2,000 లోపువేనని, అందువల్ల అత్యధిక లావాదేవీలపై ఈ మార్పు ప్రభావం ఏమాత్రం ఉండదని పేర్కొంది.

అంతేకాకుండా, నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండీఆర్ చెల్లించాల్సిన అవసరం లేదని, కాబట్టి వారికి జీఎస్టీ సమస్యే ఉత్పన్నం కాదని తెలియజేసింది. ఒకవేళ రూ.2,000 పైబడి లావాదేవీలు జరిపి ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు దానిపై జీఎస్టీ కట్టినా, ఆ మొత్తాన్ని వారు విక్రయించే వస్తువులపై చెల్లించాల్సిన జీఎస్టీ నుంచి మినహాయింపు (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) పొందవచ్చని వివరించింది. ఫలితంగా, వ్యాపారులపై ఈ జీఎస్టీ భారం వాస్తవానికి ఉండదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.

వ్యక్తుల మధ్య జరిగే 'పర్సన్-టు-పర్సన్' (పీ2పీ) లావాదేవీలపై ఈ నిబంధనల ప్రభావం ఏమాత్రం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ ఇదివరకే స్పష్టం చేసింది. ఎంత మొత్తం బదిలీ చేసినా ఈ లావాదేవీలు ఎప్పటిలాగే పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయి. ఎండీఆర్ అనేది ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ వసూలు చేసే పన్ను కాదని, యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు బ్యాంకులు, పేమెంట్ యాప్ ప్రొవైడర్ల వంటి భాగస్వాములకు పంచే రుసుము అని కూడా వివరించింది.కొత్త నిబంధనల ప్రకారం రూ.2,000 దాటిన పీ2ఎం లావాదేవీలపై 0.4% నామమాత్రపు ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు. రైల్వే, టెలికాం, ఇంధనం, వ్యవసాయం వంటి అత్యవసర, తక్కువ మార్జిన్లు ఉండే రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఒక్కోదానికి కేవలం రూ.5 ఫ్లాట్ ఛార్జీ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది.

# ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం

మొదటిపేజీ తరువాయి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి.ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా ఐదేండ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని వారికి సూచించారు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే..పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆమె స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వారికి ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో తగినంత ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ సొంత బిడ్డల్లా ఆదరించిందనీ, అందుకే నేటికీ ఇందిరాగాంధీని పల్లెపల్లెనా స్మరించుకుంటున్నారని తెలిపారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్దిదారులు, ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే కేటాయింపుల్లో 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, వీటితో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసమే పని చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ఏసీ పేలి ముగ్గురు నవజాత శిశువులు మృతి

మొదటిపేజీ తరువాయి

దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. వైద్య సిబ్బంది కేకలు వేస్తూ బయటకి వచ్చి ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు వస్తున్నాయని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ విభాగానికి చేరుకుని 27 మంది నవజాత శిశువులను కాపాడారు. అందులో ఒకరు అప్పటికే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణం కోల్పోయారు.

**అర్ధరాత్రి ఉరుకులు పరుగులు**



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం 11.45 గంటల సమయంలో కు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ విభాగంలోని రిసెప్షన్ వద్ద ఉన్న ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. అందులోని గ్యాస్ లీకై దట్టమైన పొగ అలుముకుంది. అక్కడున్న వైద్యులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. తల్లిదండ్రులు, కుటుంబీకులు కొంతమంది సిబ్బంది లోపలకు వెళ్లి చిన్నారులను ఒక్కొక్కరినీ బయటకు తీసుకొచ్చారు. అప్పటికే చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రుల రోదనలు, చిన్నారుల ఏడుపులతో ఆ వార్డు దద్దరిల్లింది. మిగతా వార్డుల్ల చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కొంతమంది సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి నవజాత శిశువులను కాపాడారు. అయినప్పటికీ ఓ శిశువు పొగతో ఊపిరాడక ప్రాణం కోల్పోయింది. ప్రమాద తీవ్రత పెరగకుండా ఆ వార్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఇంక్యుబేటర్లు పనిచేయడం ఆగిపోయాయి. వెంటిలేటర్లపై ఉన్న నలుగురు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్ధరాత్రి కలెక్టర్ రాజర్షి షా, ఎస్సీ అఖిల్ మహాజన్ రిమ్స్‌కు చేరుకుని సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులను జిల్లా కేంద్రంలోని ప్రయివేటు చిల్డ్రన్ ఆస్పత్రులకు తరలించారు.

**కండ్లు తెరవక ముందే ఆగిన ఊపిరి**

ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సలీంఖాన్(ఫిర్‌ఖాన్)-సబానాఖాన్‌కు శుక్రవారం పాప జన్మించింది. ఏడు నెలలకే పాప జన్మించడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన షేకుబాయి-కుమ్ర దినేష్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. ఎనిమిది నెలలకే బిడ్డ పుట్టడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగ వల్ల అస్వస్థతకు గురైన చిన్నారిని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన సబా సమ్రిన్-తౌఫిక్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. బరువు 1100 గ్రాములే ఉండటంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగతో ఊపిరాడక చిన్నారి అస్వస్థతకు గురైంది. మొదట జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నిర్మల్, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. అక్కడికి చేరుకునే సమయంలోనే చిన్నారి మృతిచెందింది.

# 4 జిల్లాలకు వరదముప్పు

మొదటిపేజీ తరువాయి

కుంభవృష్టితో ఆకస్మిక వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని తెలిపింది. తీవ్ర వేగంతో గాలులు వీస్తాయని.. చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి తూర్పుగా 220 కి.మీ., కళింగపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 140 కి.మీ, గోపాలపూర్‌కు దక్షిణ ఆగ్నేయంగా 150 కి.మీ



దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనించి బుధవారం రాత్రికి విశాఖపట్నం-గోపాల్‌పూర్‌కు మధ్య తీరం దాటనున్నదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాగా, తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా బలపడే అవకాశం లేదని ఐఎండీ అధికారులు స్పష్టంచేయగా, కొందరు వాతావరణ నిపుణులు మాత్రం ఒక మోస్తరు తుఫాన్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 23 సెప్టెంబర్ 2026

# 25 ఏళ్లుగా ఒకే చోట..

## జూనియర్ అసిస్టెంట్‌దే పెత్తనమా.?

**దేవాదాయ శాఖలో ఏం జరుగుతోంది, ఉన్నత అధికారులు పట్టించుకోరా.?**
**ఆయన చెప్పిందే వేదం..**
**ప్రశ్నిస్తే. సమాచారం ఇవ్వను..**
**తెలుసు అంటూ సమాధానం.?**

**పాపన్నపేట,(ప్రజావినికిడి):**
ఏడుపాయల వనదుర్గాభవాని దేవస్థానంలో హుండీ లెక్కింపు సందర్భంగా అధికారుల వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అచ్చనపల్లి శ్రీనివాస్ సుమారు 25 సంవత్సరాలుగా అదే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇంత సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న నేపథ్యంలో ఆయనకు అక్కడ విశేష ప్రాధాన్యం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని సంవత్సరాలుగా ఒకే స్థానంలో విధులు నిర్వహించడం దేవాదాయ శాఖ నిబంధనలకు పూర్తి విరుద్ధం అయిన ఉన్నత అధికారులు ట్రాన్స్ఫర్ చేయకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. హుండీ లెక్కింపు సందర్భంగా మీడియా ప్రతినిధులు వివరాలు కోరినప్పుడు, “ఆఫీసు వద్ద వాయిస్ ఇస్తాను” అంటూ ఈవో అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చకు దారితీసింది. ఇదే సమయంలో హుండీ లెక్కింపునకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించినప్పుడు “ఇవ్వను..నాకు తెలుసు” అంటూ సమాధానం ఇచ్చినట్లు మీడియా ప్రతినిధులు





చెబుతున్నారు. ఈవో సైతం హుండీ లెక్కింపు పై పూర్తి సమాచారం ఇవ్వకపోవడం వెనుక ఏమైనా గోల్మాల్ జరిగిందా అన్న అనుమానాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల కంటే సిబ్బంది మాటే చెల్లుతుందా.?

దేవస్థానంలో కీలకమైన హుండీ లెక్కింపులు, ఆదాయ వివరాలు వంటి అంశాల్లో అధికారిక సమాచారాన్ని మీడియాకు ఎవరు అందించాలి.?
ఏ విధానంలో అందించాలి.? అన్నదానిపై స్పష్టత అవసరమని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఒక ఉద్యోగి చెప్పిందే తుది నిర్ణయంగా మారుతోందా.? అధికారులపై సిబ్బంది ప్రభావం చూపుతున్నారన్న ఆరోపణల్లో వాస్తవమెంత? ఈవో సైతం కిందిస్థాయి ఉద్యోగులు చెప్పిన దానికే సై అనడం విచిత్రంగా మారిందని, అసలు ఈవో సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా లేకుంటే ఉద్యోగులకు అన్ని అప్ప చెప్పి ఏసీ గదిలో సేద తీర్చుకుంటున్నారా అన్న ప్రశ్నలు భక్తుల నుండి తలెత్తుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల విషయంలో శాఖాపరమైన మార్గదర్శకాలు పాటిస్తున్నారా.? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

### ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

భక్తుల కానుకలతో ముడిపడిన హుండీ ఆదాయంలో పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది. మీడియాకు సమాచారం ఇవ్వడంపై దేవస్థానంలో ఏదైనా అధికారిక విధానం ఉంటే దాన్ని బహిర్గతం చేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు. 25 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ పాత్రపై వస్తున్న ఆరోపణలు ఏమిటి.? హుండీ లెక్కింపులో సమాచారాన్ని వెల్లడించడంపై ఎవరి నిర్ణయం అమలవుతోంది.? అనే అంశాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. ఒకే చోట సంవత్సరాలుగా ఉన్న ఉద్యోగులను వెంటనే ట్రాన్స్ఫర్ చేయాలని లేని పక్షంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని భక్తులు పేర్కొన్నారు.



## ఘనంగా చిన్నారుల గణపతి వీడ్కోలు

**చిక్కడపల్లి, (ప్రజా వినికిడి):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గత రెండేళ్ల నుండి చిన్నారులు తల్లి దండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో డబ్బులు జమ చేసి చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద వినాయకున్ని ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా గణపతి నవరాత్రి పూజలను ముగించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నేడు నిమజ్జన కార్యక్రమం చేపట్టిన కార్యక్రమంలో చిన్నారులు ఆటపాటలు, కేరింతలతో మారు మోగించారు. దీంతో తల్లిదండ్రులు, స్థానికులు పిల్లలు చేపెట్టిన విఘ్నేశ్వర ఉత్సవాలను చూసి మురిసిపోయారు

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు..

### కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కోలన్ హన్మంత్ రెడ్డి..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని కొలన్ హన్మంత్ రెడ్డి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కుత్బుల్లాపూర్ మాజి మహిళా మండల అధ్యక్షురాలు జి. స్వప్న,గద్దం గాయత్రి, మమత,రాధ ఉన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి డివిజన్ అధ్యక్షులు శివకుమార్,ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఐఎన్టియుసి అధ్యక్షులు ఇల్లేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ మండల్ వైస్ ప్రెసిడెంట్ శివాజీ, నాగరాజు,సాయి యాదవ్,ఓబీసీ సెల్ డివిజన్ అధ్యక్షులు రామ్ యాదవ్, తిరుపతిరావు, సి.హెచ్. నాగరాజు,ఎస్టీ సెల్ అధ్యక్షులు విజయ్ నాయక్, వెంకటేష్,నవీన్ కుమార్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీవీఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లో రాంప్ కార్యక్రమం ప్రారంభం..





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
నిజాంపేట్ సర్కిల్ పరిధిలోనిబాచుపల్లి, హైదరాబాద్‌లోని బీవీఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్–అలీప్ వీహబ్, హైదరాబాద్ సహకారంతో 21-09-2026 నుంచి 15 రోజుల “స్టార్టప్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్–రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్” కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్–అలీప్ వీహబ్, హైదరాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా. జహూర్‌ఉల్లా ఎస్.ఎం.డి. అలాగే అలీప్ వ్యవస్థాపక సభ్యురాలు, డబ్ల్యూఈఐటీటీసీ,అలీప్ వైస్ చైర్‌పర్సన్ డా. జ్యోతి ఆర్. పిడికిటి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. జహూర్‌ఉల్లా మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. డా. జ్యోతి ఆర్. పిడికిటి మాట్లాడుతూ, విజయవంతమైన పారిశ్రామికవేత్తకు అవసరమైన వివిధ నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థుల ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చి, వాటిని మార్కెట్‌కు మరియు అంతిమ వినియోగదారులకు చేరేలా చేయడానికి అవసరమైన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ హైదరాబాద్ ప్రిన్సిపాల్ డా. ఎ. శారద,వైస్ ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. సునీల్ కుమార్,వివిధ డీన్లు,అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జులు డా. ఎస్. కల్యాణ్,డా. బి. ఉమారాణి కన్వీనర్లుగా వ్యవహరించారు.

## కాలనీ అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఉంటుంది..

### బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** 131– కుత్బుల్లాపూర్ డివిజన్ ఇంద్ర సింగ్ నగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ,కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులకు నా శుభాకాంక్షలు. కాలనీ అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మన్నే వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శివ కుమార్ యాదవ్, కోశాధికారి పి.వెంకటేష్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు మన్నే సత్తయ్య,గోపాల్ గౌడ్,సంపత్, ప్రభుదాస్ కాలనీ వాసులు పద్మా, జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని పూజలో పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి డివిజన్ లో మాజీసర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్,తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో కలిసి పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నారు

## గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్నేశ్వరునీ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి మరియు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరుకునే కొంగు బంగారం కావాలని వర్షాలు బాగా పడి రైతులు ప్రజలు ఆనందంగా ఉండాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గరిగ శేఖర్ ముదిరాజ్ శ్రీకాంత్ చార్యులు , సంతోష్ పద్మ ప్రసాద్ వేణుగోపాల్ భీమ్ రాజు, రామరాజు గారి ప్రకాష్ గుప్తా భాస్కర్ రెడ్డి తీరాల శ్రీనివాస్, ప్రవీణ్ గుప్తా సంగప్ప,కాలనీ వాసులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల పరిరక్షణ నాప్రధాన ధ్యేయం..

### ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
రాజ్యాంగ హక్కుల పరిరక్షనే నా ప్రధాన ధ్యేయం రాజ్యాంగ హక్కుల కోసం ప్రతిక్షణం పోరాడుతూనే ఉంటానని ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్ తెలిపారు. సామాజిక న్యాయం సమానత్వం రాజ్యాంగ హక్కుల సాధన కోసం అలుపెరగని శ్రామికుడిలా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికి అందేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తానని డాక్టర్ అవిజే జేమ్స్ స్పష్టం చేశారు. సమానత్వం సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ దళిత బహుజన హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ఆయన అన్నారు. సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలలో చైతన్యాన్ని ప్రతి పౌరుడికి సమానత్వం నెలకునాలని ఆకాంక్షించారు. ఆశయ సాధనలో ముందడుగు వేస్తూ మరింత కృషి చేస్తానని రాజ్యాంగం కల్పించిన హక్కులు ఫలాలు ప్రతి ఒక్కరికి అందించడమే ఆల్ ఇండియా దళిత సేన బలమైన పోరాటం అని ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్ తెలిపారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కరువైన స్పెషల్ బ్రాంచ్ నిఘా.?

**కిసర ఏసీబీ దెబ్బ..ఖాకి తీరుపై మచ్చ..**

**5 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ,సిఐ ఏసీబీకి చిక్కడం రాష్ట్రంలో సంచలనం..**

**పోలీస్‌స్టేషన్‌లలోనే బెయిల్‌కు 'రేట్' నిర్ణయిస్తున్నారా.?**

**సోదాల్లో భారీగా నగదు,బంగారం, ఆస్తుల పత్రాలు లభించినట్లు సమాచారం..**

**స్టేషన్ స్థాయిలో పర్యవేక్షణపై ఎస్ బి పై ప్రశ్నలు..**

**పోలీస్ స్టేషన్లో జరుగుతున్న వ్యవహారాలపై స్పెషల్ బ్రాంచ్ నిఘా శూన్యం..**

**స్టేషన్ ఎసిపి కార్యాలయాలపై ఉన్నతాధికారు నిఘా ఉండదా.?**

**కీసరలో ప్రజలు పటాకులు కాల్చారు అంటే పోలీసులు ఎంత టార్చర్ పెట్టారో.?**

**స్థానిక ప్రజలు టపాసులు కాల్చడంతో పోలీసు శాఖలో ఉన్నత అధికారులు ఆత్మ పరిశీలన చేసుకునేనా.?**







**మేడ్చల్,(ప్రజావినికిడి):** "పోలీసులు అంటే ప్రజలకు ఒక నమ్మకం,ఒక ధైర్యం,తమకు వచ్చిన ఆపదలో పోలీసులను ఆశ్రయిస్తే తమకు రక్షణతో పాటు న్యాయం జరుగుతుందనే ప్రజల నమ్మకాన్ని కొంతమంది పోలీసు అధికారులు కొన్ని పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న వ్యవహారాలు చూస్తే ప్రజలకు పోలీసులు అంటే ఏమాత్రం విశ్వాసం లేకుండా పోతోంది.ఇద్దరు అధికారులు ఏసీబీలో దొరికారు అనగానే కీసరలో ప్రజలు టపాసులు కాల్చారు పండుగ చేర్చుకున్నారు. అంటే ఆ అధికారులు స్థానిక ప్రజలను ఎన్ని ఇబ్బందులకు పెట్టారో రక్షక బటులై వాళ్లను కాపాడవలసిన వారు భక్షక బటులై ప్రజలకు ప్రత్యక్ష నరకమే చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఇంత జరుగుతుంటే ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? స్పెషల్ బ్రాంచ్ అధికారుల నిఘా ఎక్కడ.? స్పెషల్ బ్రాంచ్ అధికారులు కూడా చేతులు కలిపారా.? అంటే ప్రజలకు అందించవలసిన న్యాయబద్ధమైన పాలన డబ్బులకు, రాజకీయ నాయకులకు దాసోహం అయిపోవడంతో సామాన్య ప్రజలకు పోలీసు అంటే గౌరవం పూర్తిగా సన్నగిల్లుతోంది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో హబ్సిగూడ వీధి నెంబర్ 8లో ఆటో ట్రాలీ లో పన్నీరు ప్యాకింగ్ చేస్తున్నారన్న విషయాన్ని పోలీసులకు, హెచ్ ఫాస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినందుకు జర్నలిస్టులపైనే కేసులు పెట్టారు. కానీ అక్కడ హంగామా చేసిన రిపోర్టర్ల పై దాడికి పాల్పడ్డ మాఫియా సభ్యులపై ఇప్పటివరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కేసులు నమోదు చేయలేదు దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది దీనిపై మరి స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఇప్పటివరకు దీనిపైన పూర్తి సమాచారం సేకరించి ఉన్నత అధికారులకు ఇచ్చారా.? ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే తరువాత పరిస్థితి ఏమిటి.? అన్న దానిపై ఇటు ప్రభుత్వం, అటు ఉన్నత అధికారులు ఆత్మ పరిశీలన చేసుకునే పరిస్థితి నెలకొన్నది. కేవలం కీసర పోలీస్ స్టేషన్లోనే ఈ పరిస్థితి లేదు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లో ఇదే పరిస్థితి నెలకొన్నదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కసారి మానవ హక్కుల కమిషన్ కు వెళ్లి ఎన్ని ఫిర్యాదులు పోలీసు శాఖపై వస్తున్నాయో ఆరా తీస్తే ఉన్నత అధికారులకు వాస్తవాలు తెలుస్తాయి. పోలీసు ఉన్నత అధికారులు ఆ శాఖలోని కిందిస్థాయి అధికారుల అవినీతి, అక్రమాలు, బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యాలను బయటికి రాకుండా కాపాడుతుంటే లోలోపల అదే లోపాలు రాచపుండు(క్యాన్సర్) వలె వ్యాప్తి చెంది పోలీసు వ్యవస్థనే ఏమి చేస్తాయో వాళ్లే ఊహించుకోవాలిఈరోజు సామాన్యుడికి పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుంది, న్యాయం చేస్తాం అని గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పే ఎంతమంది పోలీసులు ఉన్నారు.? వాళ్లకే తెలియాలి.ఏది ఏమైనా ఈ రోజుల్లో పోలీస్ స్టేషన్ అంటే కేవలం డబ్బు, రాజకీయ పలుకుబడి ఉన్నవాడికే న్యాయం జరుగుతుందన్న పూర్తి విశ్వాసం పేద సామాన్య మధ్య తరగతి ప్రజలలో నిండిపోయింది. మరి

**స్పెషల్ బ్రాంచ్ నిఘా ఎక్కడ.?**

పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు అందుతున్న సేవలు,స్థానిక పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై సంబంధిత నిఘా విభాగాలు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం స్పెషల్ బ్రాంచ్ అధికారుల కీలకమైన బాధ్యత.కీసర ఘటన నేపథ్యంలో ఎస్ బి పై కూడా సమీక్ష అవసరమా.? అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది

ఇలాంటి పరిస్థితిని పోలీసు ఉన్నత అధికారులు ఎలా దూరం చేస్తారు వేచి చూద్దాం..

కీసర పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న ఏసీబీ ట్రాప్ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. స్టేషన్ బెయిల్ విషయంలో లంచం డిమాండ్ చేశారన్న ఫిర్యాదుపై రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ..కీసర సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ ద్యాపా జ్ఞానేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసింది. ఎస్ఐ రూ.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారని అధికారులు వెల్లడించారు.

**పోలీస్ స్టేషన్ లలో బెయిల్‌కు 'రేట్' ఉందా.?**

ఏసీబీ వివరాల ప్రకారం..కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ పిడిఎస్ బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు ఫిర్యాదుదారుడిని, అతని స్నేహితుడిని వేధించకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంలో రూ.5 లక్షలు తీసుకుంటుండగా ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఏసీబీ వలలో చిక్కారు.ఈ డబ్బు సీఐ ఆంజనేయులు సూచనల మేరకు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.

**కీసర చెరువు వద్ద ట్రాప్.. తప్పించుకునే యత్నం**

వినాయక నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న సమయంలో ఎస్ఐ వద్దకు డబ్బు తీసుకెళ్లినట్లు ఇతర పత్రికలు వెల్లడించాయి. కీసర చెరువు సమీపంలో కారులో నగదు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారని ఏసీబీ అధికారులు తెలిపారు.

**సోదాల్లో నగదు, బంగారం,ఆస్తుల పత్రాలు**

ట్రాప్ అనంతరం ఇద్దరు అధికారుల నివాసాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించినట్లు సోదాల్లో నగదు, బంగారు ఆభరణాలు, భూములు, ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది. ఈ ఆస్తులన్నీ అక్రమంగా సంపాదించినవేనని తేలిందని మాత్రం ఇప్పుడే చెప్పలేం అని వాటి మూలాలు, ఆదాయ వనరులపై దర్యాప్తు కొనసాగాల్సి ఉందన్నది.

**ఇక్కడే అసలు ప్రశ్న మొదలు..**

కీసర ఘటనతో ఇప్పుడు కేవలం ఒక లంచం కేసు మాత్రమే కాదు, పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు జరుగుతున్న అన్యాయం, అక్రమాలు అని ఉన్నత అధికారుల, స్పెషల్ బ్రాంచ్ అధికారుల పర్యవేక్షణ ఎలా పనిచేస్తోంది.? అనే ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది.

ఒక పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది పనితీరుపై స్పెషల్ బ్రాంచ్ అధికారుల నిఘా ఉండాల్సిన పరిస్థితి లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఏసీబీ దాడి జరిగే వరకు ఏం జరిగింది.?**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ,ఎస్ఐ లపై ఫిర్యాదులు ముందుగానే ఉన్నాయా.?
ఉంటే అవి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయా.?
వెళ్లకపోతే ఎందుకు వెళ్లలేదు.?
వెళితే ఉన్నత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు.?
స్టేషన్ లలో సిబ్బంది అధికారులపై నిఘా నివేదికలు ఎలా ఉన్నాయి.?
సమాజంలో మాఫియాలకు పోలీసులు ఎందుకు సహకరిస్తున్నారు.?
ఈ ప్రశ్నలకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.

**ప్రజల్లో చర్చకు దారితీసిన ఘటన**

సీఐ,ఎస్ఐ అరెస్ట్ వార్త వెలువడిన అనంతరం కీసర పోలీస్‌స్టేషన్ వద్ద కొందరు స్థానికులు టపాసులు కాల్చి తమ స్పందనను వ్యక్తం చేసినట్లు సామాజిక మధ్యమాలలో వీడియోలు రావడంతో పోలీసుల పాలన ఎంత భయంకరంగా ఉందో అన్న భయాందోళన ప్రజలను కలుగుతుంది.ఈ పరిస్థితి అసలు ఎలా వచ్చింది. ఉన్నత అధికారులు ఎందుకు కట్టడి చేయలేకపోయారు. కొందరు స్థానికులు గతంలో తమకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించినట్లు సమాచారం.

**ఖాకీపై నమ్మకాన్ని నిలబెట్టేది జవాబుదారీతనమే**

కీసర ఏసీబీ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో లంచం ఆరోపణలపై చట్టపరమైన ప్రక్రియ ఒకవైపు, పోలీస్ శాఖలో అంతర్గత పర్యవేక్షణ(స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం)పై సమీక్ష మరోవైపు సాగాల్సిన అవసరం కనిపిస్తోంది.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థపై నమ్మకం నిలవాలంటే.. ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ అవి ఎక్కడి నుంచి వచ్చాయి.? పోలీసు శాఖలో అధికారులపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలు పూర్తిస్థాయి విచారణ చేయించి అధికారుల, అవినీతి, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం అని తేలితే వెంటనే సస్పెండ్ తో పాటు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం ఏర్పడే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. దీనిపై ప్రభుత్వం, ఉన్నత అధికారులు ఎలా స్పందిస్తారో అన్నదానిపై ప్రజలు నిరీక్షణలో ఉన్నారు.

---

## పంజాబ్ లో చదువులు.. హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మకాలు..

### రూ.2.40 లక్షల డ్రగ్స్ పట్టివేత

### 9.6 గ్రాముల ఓజీ కుష్,14 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం..



**నాంపల్లి, (ప్రజావినికిడి):** పంజాబ్ నేషనల్ కాలేజీలో చదువులు అనంతపూర్‌కు చెందిన దేవరకొండ విద్యశ్రీ, హైదరాబాద్‌కు చెందిన కోడూరు శ్రీ వర్ధన్ రెడ్డి పంజాబ్‌లో చదువు కుంటున్నారు. ఇద్దరు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోక పోవడంతో పంజాబ్ నుంచి డగ్స్‌ను తీసుక వచ్చి హైదరాబాద్‌లో ఒక రూమ్‌లో ఉంటు అమ్మకాలు సాగిస్తున్నారు. డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ షీ టీమ్ కు పట్టుబడ్డారు.సరస్వతీ కాలనీ ఉప్పల్ మేడ్చల్ మల్కాజిగిరిలో పట్టుబడ్డారు. ఇద్దరి వద్ద 9.6 గ్రాములు. ఓజీ కుష్,14 గ్రాముల ఎండిఎంఎను ఎస్టీఎఫ్ టీమ్ స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ విద్యశ్రీ, కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డినిఅరెస్టు చేసి డ్రగ్స్‌తోపాటు ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించి నట్లు ఎస్టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ. 2.40 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు.

## గణనాధుని దర్శించుకున్న ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** గణేష్ నవరాత్రుల్లో భాగంగా మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ నందు నెలకొల్పిన గణనాధుని దర్శించుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ వైన్స్ హత్య కేసులో మరో ముగ్గురు అరెస్ట్..

### బండ్లగూడ వైన్స్ హత్య కేసులో పరారీలో ఉన్న ఉమా మహేష్ సహా ముగ్గురు పట్టివేత..



**నాగోల్,(ప్రజావినికిడి): సెప్టెంబరు 22:** బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ నయీమ్ హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమా మహేష్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్బీనగర్ లో అదుపులోకి తీసుకున్నారు.

ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే.ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమా మహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడుతాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

**బాల్య స్నేహితుల మధ్య విభేదాలు**

నయీమ్,ఉమా మహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో తిరిగేవారు. నయీమ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడుఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు పెరిగి ఒకరిపై ఒకరు కక్ష పెంచుకున్నారు.

**ఖమ్మంలో పథకం.. హైదరాబాద్‌లో హత్య**

నయీమ్‌ను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. మరుసటి రోజు ఖమ్మం నుంచి కారులో హైదరాబాద్‌కు చేరుకున్న నిందితులు.. మున్నా ద్వారా నయీమ్‌కు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్ ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లారు.

వైన్స్ వద్ద నయీమ్ కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. సిట్టింగ్ ఏరియాలో వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది.

**ప్రత్యేక బృందాలతో గాలింపు**

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్బీనగర్ డీసీపీ శ్రీమతి బి. అనురాధ ఐపీఎస్, ఎల్బీనగర్ ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసులు.. ప్రధాన సూత్రధారి ఉమా మహేష్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు.

## షాద్‌నగర్ ప్రాజెక్టు సిబ్బందికి పోషణ్ ఛాంపియన్ అవార్డులు

### షాద్‌నగర్ ప్రాజెక్టుకు చెందిన సూపర్‌వైజర్లు విజయలక్ష్మి తదితరులకు అవార్డులు..








**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా సంయుక్త కలెక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ కార్యక్రమాల అమలులో విశేషంగా సేవలందించిన షాద్‌నగర్ ప్రాజెక్టుకు చెందిన సిబ్బందికి పోషణ్ ఛాంపియన్ అవార్డులను ప్రదానం చేశారు. షాద్ నగర్ ప్రాజెక్టుకు చెందిన సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సంధ్యారాణి, కంసాన్‌పల్లి అంగన్‌వాడీ టీచర్,భీమారం ఏఎన్ఎం రజిని, కొడిచెర్ల అంగన్‌వాడీ ఆయా ఇందిరలకు అవార్డులు అందజేశారు. పోషకాహారం, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు.

# మన అంగన్‌వాడీ.. మన బాధ్యత..

## 9వ జాతీయ పోషణ మాసం థీమ్ ఆవిష్కరణ

**పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం.. అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కే.కిరణ్మయి..**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన "మన అంగన్‌వాడీ.. మన బాధ్యత..అనే థీమ్‌ను అదనపు జిల్లా కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కే.కిరణ్మయి. ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వతేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తగినంత ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకునేలా కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారుఅంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రాథమిక విద్య, బాలల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం మరియు పోషణకు కీలక కేంద్రాలుగా పని చేస్తున్నాయని తెలిపారు. పోషణ మాసం సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.



జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జి.శాంతిశ్రీ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాజెక్టుల పరిధిలో పోషకాహారం, ఆహార వైవిధ్యం, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల్లో అందించే వేడి వండిన భోజనం (ఎజవీ) నాణ్యత,పోషక విలువలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.
అంగన్‌వాడీ సేవలపై ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన (గ్రావీవీవ్) ప్రయోజనాలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన అలవాట్లపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.
జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆనందదాయకమైన వాతావరణంలో ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించినప్పుడే చిన్నారుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యాశాఖ, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయడం ద్వారా పిల్లల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచవచ్చన్నారు. ఆటలు,కథలు, పాటలు,పరస్పర చర్యల ద్వారా చిన్నారుల్లో సామాజిక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇబ్రహీంపట్నం శ్రీమతి సూర్యరత్న, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీ రమేష్, సీడీపీఓలు శ్రీమతి వెన్నెల, శ్రీమతి కాంతిరేఖ, శ్రీమతి రేణుక, శ్రీమతి హసీబా, శ్రీమతి కవిత, శ్రీమతి ఉదయ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త డి.శ్రీనివాస్,బ్లాక్ కోఆర్డినేటర్లు కె. శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం, ఎన్. శ్రీనివాస్ చేవెళ్ల,ఎ. యాదగిరి హయత్‌నగర్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నోజిగూడ మిత్రానగర్ గణపతి మండపం లో ప్రత్యేక పూజలు చేసిన పోచారం ఐటిసి పీఎస్ ఇన్స్పెక్టర్ జగన్నాథ్






**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం పిఎస్ పరిధి అన్నోజిగూడ మిత్రానగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి మండపాన్ని పోచారం ఐటిసి పీఎస్ ఇనస్పెక్టర్ జగన్నాథ్ సందర్శించారు. అనంతరం గణపయ్యకు సీఐ జగన్నాథ్ ప్రత్యేక పూజలు చెయ్యగా నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కడో దూర ప్రాంతం లో ఉండి ఆన్ లైన్ లో మోసాలు చేసే సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోచారం ఐటిసి పీఎస్ ఇనస్పెక్టర్ జగన్నాథ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు, మాజీ వార్డ్ మెంబర్ పయ్యావుల లక్ష్మి జానకిరాములు, అధ్యక్షులు పయ్యావుల సంతోష్,ప్రధాన కార్యదర్శి ఇల్లేందుల ఆంజనేయులు గుప్తా, ఉపాధ్యక్షులు జంపాల వీరేశం, కోశాధికారి ప్రొద్దుటూరు వెంకటేశం గుప్తా, జాయింట్ సెక్రటరీ పయ్యావుల ప్రశాంత్,ఉత్సవ కమిటీ కన్వీనర్ పయ్యావుల సతీష్,కో కన్వీనర్లు మంగలి అనిల్,కొలనుపాక ప్రభాకర్, తనోజ్ కుమార్, మహేష్,శ్రీను, వరుణ్ కమిటీ కార్యదర్శులు రాసకచుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో ఆయిల్‌పామ్ తొలి పంట కోత మహోత్సవం..

**ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా ఆయిల్‌పామ్ పంట కోత మహోత్సవాన్ని కేశంపేట మండలం అల్వాల గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు జిల్లాలో 4,531ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసినట్లు వెల్లడించారు.202526 సంవత్సరానికి జిల్లాలో 2,300 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 829 మంది రైతులు 2,671 ఎకరాల సాగుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.నిర్దేశించిన లక్ష్యానికి మించి రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపడం సంతోషకరమైన విషయమన్నారు.కేశంపేట మండలం అల్వాల గ్రామానికి చెందిన రైతు భుజంగ రెడ్డి 2023 అక్టోబర్ 26న 6.5 ఎకరాల విస్తీర్ణంలో 371 ఆయిల్‌పామ్ మొక్కలను నాటినట్లు ఎమ్మెల్యే తెలిపారు.
జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ద్వారా తొలి పంటను పొందడం రైతులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలు లభించే అవకాశం ఉందని,జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు.

**రైతులతో ముఖాముఖి శాస్త్రవేత్త బిఎస్ రావు..**

కోత మహోత్సవంలో భాగంగా రైతులతో ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మొక్కల సంరక్షణ,తెగుళ్ల నివారణ,దిగుబడి,మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడిగారు.బి.ఎన్.రావు,శాస్త్రవేత్త రైతుల సందేహాలకు సమాధానాలు అందిస్తూ,ఆయిల్‌పామ్ సాగులో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులు, మొక్కల సంరక్షణ, ఎరువుల వినియోగం,నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.
కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు పంటకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను వివరించడంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి వ్యక్తం చేశారు.

**ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం..**
**ఉద్యన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా**

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.రైతులు ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన సందేహాలను ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ భాషా, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి సురేష్,ఉద్యాన శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఓ.సీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ నందు నివాసం ఉండే కృష్ణప్రసాద్ ఊపిరితిత్తులకు సంబందించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు.దానికి గాను రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ మంజూరు కాగా ఆ చెక్కును బాధిత భార్య నీరజ గారికి అందజేశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు.తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారుఅనంతరం బాధిత భార్య మాట్లాడుతూ, మా వారి ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

# నందిగామ,అంతిరెడ్డి గూడలో ఘనంగా గణపయ్య నిమర్జన శోభ యాత్ర

**హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..**





**నందిగామ,(ప్రజావినికిడి):** మండల కేంద్రంతో పాటు అంతిరెడ్డిగూడ గ్రామంలో గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. నవరాత్రులలో భక్తుల పూజలందుకున్న విఘ్న వినాయకుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన ఊరేగింపునకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన వేడుకను ఇంత వైభవంగా, ప్రశాంత వాతావరణం లో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు,యువతకు అదేవిదంగా భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆ విఘ్నేశ్వరుడి చల్లని చూపు నందిగామ,అంతిరెడ్డిగూడ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంతిరెడ్డి గూడ సర్పంచ్ మంజుల యాదగిరి, నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రామ్ రెడ్డి(రామన్న),మాజీ ఎంపిటిసి దామోదర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ కుమార్ గౌడ్,నాయకులు తుమ్మల జగన్,తుమ్మల నరసింహులు,అంబటి అంజి,మైపాల్,తుప్పుడు కృష్ణ, ఆర్ రంజిత్ రెడ్డి,ఆర్ ఆర్ ఆర్ భజన కోట,రాక్ స్టార్ తదితర కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానంతో ఆత్మీయత.. సమాజంలో సేవా స్ఫూర్తికి ప్రతీక

**ఇప్పలపల్లిలో గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన రవీందర్ యాదవ్**





**కేశంపేట,(ప్రజావినికిడి):** మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ సందర్శించారు.ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందించారు. వినాయక ఉత్సవాలు భక్తితో పాటు సేవా స్ఫూర్తిని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమని రవీందర్ యాదవ్ అన్నారు.గ్రామ ప్రజలు,యువత కలిసి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంజుల జంగయ్య,మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, సర్పంచ్ రమేష్ యాదవ్,మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ,శ్రవణ్ పట్వారీ, తిర్మల్ రెడ్డి శ్రీనివాస్,కౌన్సిలర్ మహమ్మద్ ఎజాజ్ (అడ్డు),ఉప సర్పంచ్ సహదేవ్,నాయకులు భిక్షపతి, సురేష్,యాదయ్య, నవీన్,శ్రీను,ప్రకాష్,ప్రశాంత్,తోట శ్రీశైలం,జమాల్ ఖాన్,ప్రేమ్ కుమార్ గౌడ్,దశరథ్, మాధవ్,తక్రుఫ్,రాజు,అశోక్, పవన్ సింగ్, కందాడ యాదయ్య,గోపి రాము,సురేష్, సంజు నాయక్,శ్రీరామ్,రాజేష్,లచ్చి రామ్ తదితరులు, గ్రామస్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కమనీయం చిన్నారి అక్షయ నృత్యం.

## - చిన్నారిని అభినందించిన సినీ హీరో సుమన్..




**షాద్‌నగర్,సెప్టెంబర్ 22,(ప్రజావినికిడి):ం** సాంప్రదాయ అలంకరణలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం కన్నుల పండుగగా ఉందని సినీ నటుడు సుమన్ అన్నారు.సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అభినందన సంస్కృత సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలలో భాగంగా 'అభినందన అక్కినేని పురస్కారని ఎంపికై కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలను తిలకించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆధునిక సమాజంలోనూ మన సాంప్రదాయ కళలపై మక్కువ పెంచుకుంటూ చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని అభ్యసించడం అభినందనీయమన్నారు.షాద్‌నగర్ పట్టణానికి చెందిన నాట్య నివేదాలయం కూచిపూడి గురువు భార్గవి శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో విద్యార్థులు తేజశ్రీ,నందిత, శ్రీయుక్త,ప్రణవి,ఆద్యశ్రీ, కాత్యాయిని,ఆరాధ్యతో పాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# యశోద హైటెక్ సిటీ అరుదైన రికార్డు

**425 కిడ్నీ మార్పిడిలు విజయవంతం**

**60 ఏళ్లు పైబడిన వారిలోనూ సక్సెస్**

**బ్లడ్ గ్రూప్ వేరైనా కిడ్నీ మార్పిడి సాధ్యమేనని నిరూపించిన వైద్య బృందం**




**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 22**

యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. ఏకంగా 425 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా నిర్వహించి, వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన రికార్డును నెలకొల్పింది. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి మరియు వారి బృందం ఇప్పటి వరకు 425 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా నిర్వహించి, ఎంతో మంది బాధితులకు పునర్జన్మ ప్రసాదించారు. ఈ సందర్భంగా శంషాబాద్ ఎలైట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్య నిపుణులు కిడ్నీ మార్పిడిలో తాము సాధించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూపులు కలవడం ప్రధానం. అయితే,యశోద హాస్పిటల్స్ బృందం బ్లడ్ గ్రూప్ వేరుగా ఉన్న రోగులకు (ఏబిఓ ఇన్ కాంపటబుల్ ట్రాన్సప్లంట్) కూడా విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వహించి, వారు ప్రస్తుతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేలా చేయడంలో విజయం సాధించింది. వయోభారంతో సంబంధం లేకుండా శస్త్రచికిత్సల విషయంలో వయస్సు ఒక అడ్డంకి కాదని యశోద వైద్యులు నిరూపించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులలో కూడా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి,వారి ఆయుష్షును పెంచడంలో కీలక పాత్ర పోషించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఈ మైలురాయిని చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్. మురళీనాథ్ ఉక్కదల మాట్లాడుతూ, కిడ్నీ వైఫల్యంతో బాధపడే రోగులకు డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.కానీ, కిడ్నీ మార్పిడి వల్ల రోగుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయి.మా బృందం సాధించిన ఈ 425 ట్రాన్స్‌ప్లాంట్లు కేవలం సంఖ్య మాత్రమే కాదు, 425 కుటుంబాల్లో నిండిన వెలుగులు.రక్త గ్రూపులు వేరైనా కిడ్నీ మార్పిడి సాధ్యమే అన్న అవగాహన ప్రజల్లో పెరగాలి, అని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్, అత్యాధునిక మౌలిక సదుపాయాలు మరియు అనుభవజ్ఞులైన వైద్య బృందంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి చికిత్సలను అందిస్తూ, దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌గా ఎదుగుతుందన్నారు.

# రైతుల ఆందోళన.. సీఎం, మంత్రులకు పరిపాలన పై పట్టు లేకపోవడానికి నిదర్శనం

## ఎంపీ డీకే.అరుణ..



**మహబూబ్నగర్,(ప్రజావినికిడి):**
సీఎం సొంత జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న స్పందించకపోవడం, పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని, పరిపాలన మీద పట్టు లేకపోవడం,రైతాంగం సమస్యల పై అవగాహనలేమి దౌర్భాగ్య పరిస్థితిలో ప్రభుత్వం ఉంది.రైతులు,
ప్రతిపక్షాల పోరాటంతో ప్రభుత్వనికి గత్యంతరం లేక దిగి వచ్చిందని, ఇది రైతులు సాధించిన విజయమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. నీళ్ళు ఇవ్వమని చెప్పిన మంత్రులు,ఎమ్మెల్యేల అహంకారం అణిచి,ప్రభుత్వం మెడలు వంచారని అన్నారు.
ప్రాజెక్ట్ లో నీళ్ళు లేవని చెప్పిన మంత్రులకు కనీసం జూరాలలో ఎన్ని నీళ్లు ఉన్నాయో తెలియదని, కళ్ళముందు నీళ్ళు పెట్టుకొని, నీళ్ళు ఇవ్వమని అంటే రైతులు చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. రైతుల ఆందోళనకు,ప్రతిపక్ష బీజేపీకి భయపడే నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని తెలిపారు.

**జూరాలలో 9 టీఎంసి ల నీళ్ళు ఉండగా**

అసలు రైతుల పంటలు ఎండబెట్టాలనే దురుద్దేశం ఏంటని ప్రశ్నించారు. మంత్రులు,ఎమ్మెల్యేలకు సోయి ఉంటే ఈ పరిస్తితి వచ్చేది కాదని విమర్శించారు.జూరాల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని సెప్టెంబర్ 15 నుంచి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సెప్టెంబర్ 19వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడి.. పంటలు ఎందుతున్నాయని వెంటనే నీటిని విడుదల చేయాలని తెలిపామని, భవిష్యత్ త్రాగునీటి అవసరాల కోసం కర్ణాటక తో మాట్లాడి నీరు తీసుకోవచ్చని కూడా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలియజేసినట్లు ఎంపీ డీకే అరుణ తెలిపారు.రైతుల ఆవేదన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులకు పట్టలేదని, రైతుల పక్షాన ఆందోళనల తో కలెక్టర్,జిల్లా ఇరిగేషన్ అధికారుల దృష్టికి రైతుల కష్టాలు తెలియజేసినట్లు గుర్తుచేశారు.

**మూడు రోజులుగా రైతులు,ప్రతిపక్షాలధర్నా**

జూరాల ప్రాజెక్టు వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టారు.ఇవాళ మంత్రులు, ఎమ్మెల్యేల పై రైతులు,ప్రజలలో వస్తున్న వ్యతిరేకత కప్పి పుచ్చుకునేందుకు,కర్ణాటకతో చర్చిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటు.

**వాళ్లకు కుర్చీలే ముఖ్యం.**

కుర్చీలు ఉంటే చాలు.. ఇసుక,మట్టి మాఫియా,భూ కబ్జాలు,ఇల్లీగల్ గా భూముల రెగ్యులరైజేషన్ చేసుకోవడం పైనే వాళ్ళు బిజీగా ఉన్నారు.రైతుల సమస్యలు తెలుసుకునే సమయం వాళ్ళకు లేదని అన్నారు.కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడామని డ్రామాలు బంద్ పెట్టాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే..బీజేపీ ఊరుకోదని హెచ్చరించారు. ఇటువంటి వ్యవహారం మళ్ళీ చేస్తే..రైతులు ఉరికించి కొడతారని అన్నారు.

# వెయ్యి కుటుంబాలకు మంచినీటి క్యాన్లను అందించిన స్థానిక కౌన్సిలర్ రిజ్వానాముబారక్ అలీ ఖాన్

## పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**షాద్ నగర్ పట్టణంలోని 13వ వార్డు పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన ఉచిత మంచినీటి వాటర్ బబుల్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుమారు వెయ్యి కుటుంబాలకు ఉచితంగా మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులుగా గెలిచిన తర్వాత ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి,వారికి ఎలాంటి కష్టం,ఆపద వచ్చినా స్పందించి అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా సొంతంగా ఆర్థిక భారాన్ని భరిస్తూ మంచినీటి కోసం క్యాన్లను ఉచితంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. వెయ్యి కుటుంబాలకు మంచినీటి క్యాన్లను అందించిన స్థానిక కౌన్సిలర్ రిజ్వానాముబారక్ అలీ ఖాన్ దంపతులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ప్రజలకు అవసరమైన సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బాబర్ ఖాన్, విశ్వంఅప్ప,దిలీప్,ఖదీర్, సురేష్,కుమారి ప్రవీణ్,జి. శ్రీనివాస్,లాయక్,ఇసాక్,సదక్, నల్లమోని శ్రీధర్,రఘు నాయక్, అప్పి,అన్వర్,ముజ్తబా అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల రైతులకు నీళ్లు ఇవ్వకుండా..

## రామచందర్ రావును అడ్డుకోవడం ఎందుకు.?

**పాలమూరు వాణిగా ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి.**

**పాలమూరు రైతుల గొంతు నొక్కొద్దు..**

**జూరాల నుంచి వెంటనే నీళ్లు విడుదల చేయాలి**

**:నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి**



**జడ్చర్ల,(ప్రజావినికిడి):**జూరాల ప్రాజెక్టు వద్ద సాగునీటి కోసం ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని భరోసా కల్పించేందుకు వెళ్తున్న తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావుని జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామిక చర్య అని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు.రైతులు సాగునీటి కోసం ఆందోళన చేస్తుంటే వారి వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని,వారికి అండగా నిలిచేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్గమధ్యంలోనే అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు.రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం కూడా నేరమా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**జూరాల నుంచి వెంటనే నీళ్లు విడుదల చేయాలి**

జూరాల ప్రాజెక్టు కింద ఇప్పటికే రైతులు పంటలు సాగు చేశారని, ఈ కీలక సమయంలో సాగునీరు విడుదల చేయకపోతే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.రైతుల పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పాలమూరు రైతుల గొంతు నొక్కొద్దు**

రైతుల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించేందుకు రామచందర్ రావు జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వకుండా.. రైతుల పక్షాన మాట్లాడుతున్న నాయకులను అడ్డుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

**జూరాల పూడిక సమస్యను వెంటనే పరిష్కరించాలి**

జూరాల ప్రాజెక్టును 10 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించినప్పటికీ,పూడిక పేరుకుపోవడం వల్ల పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.పూడిక సమస్యను పరిష్కరించి, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.



**పంటలు ఎండిపోయిన తర్వాత బోనస్ ఇచ్చే పరిస్థితి రానివ్వొద్దు**

రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం.. రైతుల సమస్యలపై మాట్లాడుతున్న నాయకులను పోలీసులతో అడ్డుకోవడం మానుకోవాలని అన్నారు. రైతులకు నీళ్ల ఇవ్వకుండా, పంటలు నష్టపోయిన తర్వాత బోనస్ ఇచ్చే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించకూడదని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

**పాలమూరు వాణిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలమూరు వాణిగా విజ్ఞప్తి చేస్తున్నాను పాలమూరు రైతుల కష్టాలను అర్థం చేసుకుని,జూరాల ప్రాజెక్టు నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలి.ఇప్పటికే పంటలు వేసుకున్న రైతులను ఆదుకుని,వారి పంటలను కాపాడాలి.
రైతుల సమస్యలను పరిష్కరించకుండా పోలీసుల ద్వారా అడ్డంకులు సృష్టించడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. రైతుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.



**అన్నదాతల సమస్యలపై బీజేపీ వెనక్కి తగ్గదు**

రైతుల గొంతుకగా నిలబడతాం..రైతుల కోసం నినదిస్తాం..ప్రభుత్వాన్ని నిలదీస్తాం..రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం.ఈ కార్యక్రమంలో టి.ఆచారి,గువ్వల బాలరాజు,శాంతి కుమార్,బస్వా నరసయ్య, నరేందర్ రావు,దిలీప్ చారి,సత్య యాదవ్,అందే బాబయ్య, కేవీఎన్ రెడ్డి,ఎగ్గా నరసింహులు, పద్మజ రెడ్డి,పవన్ కుమార్,గోలి మధుసూదన్ రెడ్డి,శ్రీనివాస్, బాల,త్రిపుర సుందరి, సాహితి,జనార్దన్ రెడ్డి,బాపు రెడ్డి,బొక్క బాల్ రెడ్డి,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డి కాలనీ లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ చింతల అరుణ



**నాగోల్,(ప్రజావినికిడి):** జంగారెడ్డి కాలనీ వాసుల ఆరోగ్యం,శారీరక దృఢత్వం, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడంలో ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ వ్యాయామం చేసుకునేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి అవసరమైన సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు.ఓపెన్ జిమ్ ఏర్పాటుతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డి కాలనీ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, సెక్రటరీ వెంకన్న గౌడ్ తదితరులు, కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు

# పోటీ పరీక్షల సిలబస్‌పై వస్తున్న వదంతలకు టీజీపీఎస్సీ తెర

## ప్రస్తుతానికి ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని వెల్లడి

**,సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అమెరికాకు ఇరాన్ కీలక ఆఫర్.. దిగొచ్చిన చమురు ధరలు

**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం.

అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు.

హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది.

హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి.

# సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో ఆంధ్ర భోజనం..

## ప్రపంచ వేదికపై తెలుగు రుచికి కొత్త గుర్తింపు

**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**

తెలుగు వంటకాల రుచి ఇప్పుడు మరోసారి అంతర్జాతీయ వేదికపై చర్చకు వచ్చింది. సింగపూర్ నుంచి మెల్‌బోర్న్‌కు వెళ్లే సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో 'ఆంధ్ర మీల్'ను ఆహార ఎంపికగా ఆర్డర్ చేసిన ఓ తెలుగు మహిళ తన అనుభవాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పంచుకున్నారు. పప్పు, పచ్చడితో కూడిన ఆంధ్ర భోజనం విమానంలో అందుబాటులో ఉండటం చిన్న విషయంలా కనిపించినా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఇది ప్రత్యేకమైన గర్వకారణంగా మారింది.

. భారతీయులకు హైకమిషన్ కీలక హెచ్చరిక వాస్తవానికి ఆంధ్ర భోజనం ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఢిల్లీ ఆంధ్ర భవన్ నుంచి బెంగళూరులోని నాగార్జున వంటి రెస్టారెంట్ల వరకు ఆంధ్ర వంటకాలను ఆస్వాదించేందుకు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఆసక్తి చూపుతున్నారు. పప్పు, పచ్చడి, సాంబార్, కూరలు, వేపుళ్లు, పెరుగు, అన్నంతో కూడిన సంప్రదాయ ఆంధ్ర భోజనం తనదైన రుచితో ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రపంచవ్యాప్తంగా చైనీస్, మెక్సికన్, జపనీస్, ఇటాలియన్ వంటకాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అదే విధంగా ఒకరోజు న్యూయార్క్, లండన్,



సింగపూర్, దుబాయ్ లేదా మెల్‌బోర్న్‌లో ఎవరైనా "తెలుగు మీల్" లేదా "ఆంధ్ర మీల్" కావాలని అడిగితే.. అందులో ఎలాంటి వంటకాలు ఉంటాయో ప్రపంచానికి స్పష్టంగా తెలిసే స్థాయికి తెలుగు వంటకాలు ఎదగాలనే ఆకాంక్ష వ్యక్తమవుతోంది. తెలుగు సంస్కృతికి ఇందుకు కావాల్సిన బలమైన పునాది ఇప్పటికే ఉంది. తెలుగు భాష, ఆంధ్ర-తెలంగాణ వంటకాలు, కొండపల్లి బొమ్మలు, కలంకారీ, చేనేత వస్త్రాలు, సంగీతం, నృత్యం, తెలుగు సినిమా, సాహిత్యం, జానపద కళలు ఇలా ప్రపంచానికి పరిచయం చేయగల అనేక అంశాలు ఉన్నాయి. అంతేకాదు.. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన తెలుగు ప్రవాస సమాజం ఈ సంస్కృతికి వారధిగా నిలిచే అవకాశం ఉంది. విదేశాల్లో తెలుగు సాంస్కృతిక కేంద్రాలు, భాషా అభ్యాస కార్యక్రమాలు, వంటల తరగతులు, హస్తకళల వర్క్‌షాప్‌లు, తెలుగు ఆహార ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఈ వారసత్వాన్ని మరింత విస్తృతంగా పరిచయం చేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ సంస్థలు, ప్రవాస తెలుగు సంఘాలు, వ్యాపార సంస్థలు కలిసి పనిచేస్తే తెలుగు ఆహారం, కళలు, హస్తకళలు, భాషకు అంతర్జాతీయ మార్కెట్‌ను అభివృద్ధి చేయవచ్చు. ఇది కేవలం సంస్కృతిని కాపాడుకోవడం మాత్రమే కాదు. ఆహార వ్యాపారాలు, పర్యాటకం, హస్తకళలు, చేనేత, భాషా విద్య, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కొత్త వ్యాపార అవకాశాలు, ఉపాధి కూడా సృష్టించవచ్చు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో అందుబాటులోకి వచ్చిన ఒక 'ఆంధ్ర మీల్'.. తెలుగు రుచులు ప్రపంచ స్థాయికి చేరుకునే సామర్థ్యానికి చిన్న ఉదాహరణగా నిలుస్తోంది. తెలుగు సంస్కృతిని కేవలం భద్రపరచడం కాకుండా.. ప్రపంచం నేర్చుకునేలా, తినేలా, అనుభవించేలా, ఆస్వాదించేలా చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

# కూటమి బలంగా ఉండాలి..

## కానీ షరతులు ఇవే.. : డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు

**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**

కూటమి భవిష్యత్తు రాజకీయాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికలలో కలిసే పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో కొన్నిరోజులుగా జరుగుతున్న ప్రచారానికి పవన్ ఎండ్ కార్డ్ వేశారు. సొంత నియోజకవర్గం పిఠాపురంలో పవన్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఆయన పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ గ్రౌండులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా అందరం కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

భారతీయులకు హైకమిషన్ కీలక హెచ్చరిక కూటమిగా కలిసి ప్రయాణిస్తామని పవన్ పునరుద్ఘాటించారు. అయితే కూటమిలోని మూడు పార్టీల నేతలకు కీలక సూచనలు చేశారు. "ఎవరికి ఎవరు తగ్గకుండా, జనసేన గౌరవానికి భంగం కలగకుండా అడుగులు వేస్తున్నాం" అంటూ తన మనసులో మాటను బయటపెట్టారు. స్థానిక ఎన్నికల్లో



తన బలానికి తగినట్లు సీట్లు ఇవ్వాలని జనసేన కోరుకుంటున్న విషయం తెలిసందే. ఈ విషయమై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ప్రకటన చేశారు. అయితే ఇప్పటివరకు లోకల్ పోల్స్ పై ఎటువంటి ప్రకటన చేయని పవన్ తొలిసారిగా స్పందించారు. జనసేన గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఇదే సమయంలో తనకు కృతజ్ఞత ఎక్కువ అని, కష్టాల్లో ఉన్న వ్యక్తులకు అండగా ఉండటం తన గుణమని పవన్ వివరించారు. ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకునే నడుచుకుంటానని వ్యాఖ్యానించారు. ముందు ప్రజల అవసరాలు తీర్చుకుందామని, తర్వాత వారి ఆకాంక్షలు, ఆశలు నెరవేరుద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతల పనితీరుపై పవన్ స్వల్ప అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారం వచ్చిన తర్వాత అంతా చల్లబడ్డారని చురకలు అంటించారు. ఇక పవన్ వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్ లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. జనసేన గౌరవానికి భంగం కలగనీయనని చెప్పిన పవన్, తనకు కృతజత ఎక్కువని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తానని ఎందుకు చెప్పారనేది అంతుచిక్కడం లేదని అంటున్నారు. తన వెంట నడుస్తున్న కార్యకర్తల కష్టాలు తీరుస్తానని, వారి ఆశలు నెరవేరుస్తానని నమ్మకం కలిగించడానికే ఆయన ఈ వ్యాఖ్యలు చేసివుండొచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ఎన్నికలపై జనసేనలో చాలా మంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. వారి మనసు తనకు తెలుసునని, కార్యకర్తల గౌరవానికి భంగం కలగకుండా నిర్ణయాలు ఉంటాయని సంకేతాలు ఇవ్వడానికి పవన్ ప్రయత్నించినట్లుగా భావిస్తున్నారు.

# నేను జగన్‌ను కలిసేది అప్పుడే..

## కూతురి పెళ్లిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే ఖర్మ నాకు లేదు: షర్మిల

**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో తాను రహస్యంగా సమావేశం అవుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని, అవి కేవలం కట్టుకథలని కొట్టిపారేశారు. తన కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసుకునే ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా తాను జగన్‌ను కలవబోతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు షర్మిల తెలిపారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడే తాను చివరిసారిగా జగన్‌ను కలిశానని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కలిస్తే, అది కేవలం తన కుమార్తె అంజిలి రెడ్డి వివాహ మహోత్సవానికి ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించినట్లే జగన్‌ను కూడా పిలుస్తానని, ఇందులో వింతేమీ లేదని అన్నారు.

"నేను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు మాత్రమే. ఈ విశ్లేషణలు పూర్తిగా నిరాధారం. శుభకార్యానికి, రాజకీయానికి ముడిపెట్టి నా విశ్వసనీయతను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు" అని షర్మిల హెచ్చరించారు.

**వివాహ వేడుకల వివరాలు**

ఈ సందర్భంగా షర్మిల తన కుమార్తె వివాహ వేడుకల వివరాలను అధికారికంగా ప్రకటించారు. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థం ఈ నెల 24న, వివాహం నవంబర్ 25న, రిసెప్షన్ డిసెంబర్ 5న జరుగుతాయని వెల్లడించారు. ఈ శుభవార్తను తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.

కుటుంబ సభ్యులు, కాబోయే వియ్యంకుల సమక్షంలో ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తొలి వివాహ పత్రికను ఉంచి, ఆయన ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. తన తండ్రి దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ అని షర్మిల పేర్కొన్నారు. కాబోయే నవదంపతులను తెలుగు ప్రజలందరూ హృదయపూర్వకంగా ఆశీర్వదించాలని ఆమె కోరారు.

# కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు

## : ప్రైవేటు సంస్థల రిట్ పిటిషన్ కొట్టివేత



**సెప్టెంబర్ 22 (ప్రజావినికిడి):**

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కావేరీ నదీ జలాల వివాదంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులను వెలువరించింది. కర్ణాటక రాష్ట్రానికి అదనంగా 70 టీఎంసీల నీటిని కేటాయించాలంటూ ఒక ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం... దానిని తీవ్రంగా పరిగణిస్తూ కొట్టివేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో ఏ విధమైన థర్డ్ పార్టీలు లేదా ప్రైవేటు సొసైటీలు, వ్యక్తులు జోక్యం చేసుకోవడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసింది.కేవలం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే, పోరాడే హక్కు ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటువంటి థర్డ్ పార్టీ పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ఎప్పటికీ ముగియవని అభిప్రాయపడింది. తమిళనాడుకు 15 రోజుల పాటు ప్రతిరోజూ 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీజలాల నిర్వహణ అథారిటీ జులై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది.మరోవైపు, కర్ణాటకలో కరవు పరిస్థితుల కారణంగా ఈ నీటి విడుదలను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు, కన్నడ సంఘాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఇంకోవైపు, ఈ వ్యవహారంలో తమిళనాడుకు చెందిన విజయ్ సర్కార్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# దేశంలోనే అతిపెద్ద రియల్ ఎస్టేట్ డీల్..

## రూ. 711 కోట్లతో టవర్ కొన్న ఏంజెల్ వన్ అధినేత



**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**దేశ ఆర్థిక రాజధాని ముంబైలో దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాపర్టీ డీల్ నమోదైంది. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'ఏంజెల్ వన్' వ్యవస్థాపకుడు దినేష్ ఠక్కర్, సముద్ర తీరానికి అభిముఖంగా ఉన్న ఒక విలాసవంతమైన భవనాన్ని రూ. 711 కోట్లకు కొనుగోలు చేశారు. భారతదేశ చరిత్రలో ఒకే నివాస ఆస్తికి సంబంధించి జరిగిన అత్యంత ఖరీదైన లావాదేవీ ఇదే కావడం విశేషం.ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ ఎనిమిది అంతస్తుల భవనం సుమారు 63,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనిని ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎంబసీ డెవలప్‌మెంట్స్ లిమిటెడ్' నిర్మించింది. ఈ భారీ డీల్ వార్త వెలువడిన వెంటనే, స్టాక్ మార్కెట్‌లో ఎంబసీ డెవలప్‌మెంట్స్ షేర్లు 8.3 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి.

ఈ లావాదేవీ ముంబైతో పాటు దేశవ్యాప్తంగా అల్ట్రా-లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉన్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. ఇటీవల కాలంలో ఇటువంటి భారీ కొనుగోళ్లు పలుమార్లు చోటుచేసుకున్నాయి. గతంలో యూఎస్‌వీ ఛైర్‌పర్సన్ లీనా గాంధీ తివారీ రూ.639 కోట్లతో ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేయగా, ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్, ఆయన కుటుంబ సభ్యులు రూ.400 కోట్లకు పైగా విలువైన సీ-ఫేసింగ్ టవర్‌ను సొంతం చేసుకున్నారు.

ప్రాపర్టీ డేటా విశ్లేషణ సంస్థ జాప్‌కీ ప్రకారం, జనవరి 2025 నుంచి ఇప్పటివరకు దేశంలో రూ.100 కోట్లకు పైగా విలువైన 37 రెసిడెన్షియల్ డీల్స్ జరిగాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.5,600 కోట్లుగా నమోదైంది.

# రెండు రోజులకు మించి ఫైళ్లు నిలిచిపోకూడదు

## : అధికారులకు ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వార్నింగ్

**సెప్టెంబర్ 22(ప్రజావినికిడి):**




ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని పాలనా వ్యవహారాల్లో జాప్యాన్ని నివారించేందుకు, ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. శాఖలోని ఏ స్థాయిలోనైనా ఫైలు పరిశీలన రెండు రోజులకు మించి నిలిచిపోకూడదని, అలాగే ఏ రకమైన వినతి లేదా అంశంపైనైనా గరిష్ఠంగా 15 రోజుల్లో పూర్తి స్థాయి నిర్ణయం తీసుకునేలా స్పష్టమైన మార్పు తేవాలని ఆయన నిరూపించారు. అనవసర జాప్యానికి కారణమయ్యే బాధ్యులైన అధికారుల నుంచి తక్షణ వివరణ తీసుకోవడంతో పాటు అవసరమైతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మంగళగిరిలోని ఆఫీసులో ఫైళ్ల పరిష్కారం, వైద్య సిబ్బంది హాజరుపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రిత్వ శాఖ దృష్టికి వచ్చిన 4,420 అంశాల్లో ఎక్కువ భాగం బదిలీలకు సంబంధించినవే ఉన్నాయని, అయితే అందులో కేవలం 40 శాతం ఫైళ్లు మాత్రమే పరిష్కారం కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత వల్లే జాప్యం జరుగుతోందని అధికారులు వివరణ ఇవ్వగా, ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా విధులకు సుదీర్ఘకాలంగా హాజరుకాకుండా అనధికారికంగా గైర్హాజరవుతున్న 493 మంది వైద్యులపై మూడు నెలల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బ్లడ్ బ్యాంక్‌ను నిస్వార్థంగా నడిపిస్తున్నా

## రక్తాన్ని అమ్ముకుంటున్నాడు అనే ఆరోపణలపై చిరంజీవి ఘాటు స్పందన



తన సినీ ప్రస్థానంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్'లో మెగాస్టార్ చిరంజీవి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా, తనపై, చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారాలు, నిందలపై ఆయన అత్యంత తీవ్రస్థాయిలో స్పందించారు. దశాబ్దాలుగా ఎంతో పవిత్రంగా, నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌లో రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ కొంతమంది చేస్తున్న దారుణమైన ఆరోపణలు పూర్తిగా మూర్ఖత్వంతో కూడుకున్నవని ఆయన కొట్టిపారేశారు.

సినిమాల్లో తాను తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన మొత్తాన్ని రక్తం విక్రయించడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లను విక్రయించాల్సి ఉంటుందో విమర్శలు చేసేవారికి కనీస ఆలోచన ఉందా? అని చిరంజీవి ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి వద్ద నుంచి ఎలాంటి డొనేషన్లు స్వీకరించకుండా, కేవలం తన సొంత కష్టార్జితంతోనే ఈ సేవా సంస్థను స్థాపించి నడుపుతున్నానని స్పష్టం చేశారు. రక్తదానం అనే పవిత్ర ప్రక్రియ ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న వేళ, ఇటువంటి పనికిమాలిన వ్యాఖ్యలను తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వనని, ధర్మమే తనను కాపాడుతుందని వ్యాఖ్యానించారు.

# సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి..



## 'శివశంకర వర ప్రసాద్' నుంచి 'చిరంజీవి' వరకు అపూర్వ ప్రయాణంపై మెగాస్టార్ భావోద్వేగం




తన జీవితంలో అతిపెద్ద విజయమని వ్యాఖ్య తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్ గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు. కాగా, చిరు నటించిన మొదటి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ, 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదలైంది. ప్రస్తుతం ఆయన 'కాకా', 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు.

# మహావీర్ కర్ణగా రాఘవ లారెన్స్..

## అంచనాలు పెంచుతున్న ఫస్ట్ లుక్!




ప్రముఖ నటుడు రాఘవ లారెన్స్, దర్శకుడు రమేశ్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'మహావీర్ కర్ణ' నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో కర్ణుడి పాత్రలో రాఘవ లారెన్స్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ మూవీస్ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ పోస్టర్‌ను విడుదల చేయడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. పెన్ మూవీస్ అధినేత జయంతిలాల్ గడ, ఆర్వి స్టూడియోస్ మరియు శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మొదటిసారిగా ఒక పౌరాణిక పాత్రను పోషిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను ప్రేక్షకులకు ఒక గొప్ప విజువల్ ఫీస్ట్‌గా అందించాలనే లక్ష్యంతో మేకర్స్ పని చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం భారీ సెట్లు, ఆనాటి కాలాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లు, కళ్లు చెదిరే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అత్యాధునిక విఎఫ్ఎక్స్ హంగులతో కర్ణుడి ప్రపంచాన్ని అపూర్వమైన రీతిలో తెరపై ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గంభీరమైన రాజ్యాలు, పురాతన యుద్ధ క్షేత్రాలు, ఉత్కంఠభరితమైన పోరాట సన్నివేశాలతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలని దర్శకుడు రమేశ్ వర్మ భావిస్తున్నారు. గౌరవం, విధి, విశ్వాసం, త్యాగాలకు ప్రతీకగా నిలిచే కర్ణుడి పాత్రలో లారెన్స్ ఎలా ఉంటారన్నది ఆసక్తికరం. సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ఒక్కొక్కటిగా వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# రష్మిక అంకితభావం అద్భుతం..

## : 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లే




రష్మిక మందన్న ప్రధాన పాత్రలో తాను దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా' గురించి, ఆమెతో తనకున్న అనుబంధం గురించి దర్శకుడు రవీంద్ర పుల్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రష్మికతో కలిసి పనిచేయడం ఒక స్ఫూర్తిదాయకమైన, మర్చిపోలేని అనుభూతి అని ఆయన అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ పోస్ట్ చేశారు. "కొన్ని పుట్టినరోజులు కేవలం శుభాకాంక్షల వల్ల ప్రత్యేకంగా నిలుస్తాయి. కానీ ఈ పుట్టినరోజు మాత్రం ఆ విషెస్ చెప్పిన వారి వల్ల మరింత ప్రత్యేకంగా మారింది. నాకు కాల్స్, మెసేజ్‌లు, పోస్టుల ద్వారా విషెస్ చెప్పిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది" అంటూ రవీంద్ర తన పోస్టులో పేర్కొన్నారు. అనంతరం 'మైసా' చిత్రం గురించి ప్రస్తావిస్తూ.. "మా ప్రయాణంపై నమ్మకం ఉంచి, 'మైసా' చిత్రాన్ని ఇంతగా ఆదరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది. ఈ కల నిజం కావడానికి అండగా నిలిచిన నా టీమ్, కుటుంబం, స్నేహితులు, ముఖ్యంగా రష్మిక మందన్న గారికి నేను ఎంతో రుణపడి ఉంటాను" అని ఆయన వివరించారు. రష్మిక గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "ఈ సినిమాను నమ్మి, ఎంతో విశ్వాసంతో నిలబడిన రష్మిక గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. 'మైసా' కోసం ఆమె ఎంతో నిజాయితీ, అంకితభావం, హృదయంతో పనిచేశారు. ఆమెతో కలిసి పనిచేయడం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఈ ప్రయాణంలో ఆమె ఒక ముఖ్యమైన భాగం కావడం సంతోషంగా ఉంది" అని రవీంద్ర పుల్లే తెలిపారు. "మీ అందరి ప్రేమ నన్ను మరింత బాధ్యతాయుతంగా ఉండేలా చేస్తుంది. మెరుగైన పని చేయడానికి నన్ను ప్రోత్సహిస్తుంది. మరిన్ని మంచి కథలతో మీ ముందుకు వస్తాను. ఈ ప్రయాణంలో అందరం కలిసి ముందుకు సాగుదాం" అని చెబుతూ ఆయన తన పోస్టును ముగించారు. ప్రస్తుతం రవీంద్ర పుల్లే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# స్టైలిష్ అవతార్‌లో రాశి ఖన్నా..

## మోనోక్రోమ్ ట్రెండ్ సెట్!



టాలీవుడ్ లోనే కాక బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో పవర్-డ్రెస్సింగ్ గోల్స్‌ను సెట్ చేస్తూ అలరిస్తున్న బ్యూటీ రాశి ఖన్నా, తాజాగా తన స్టైలిష్ ఫోటోలతో సోషల్ మీడియాను ఊపేస్తోంది. షార్ప్‌గా ఉన్న క్లాసీ వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌లో ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ అండ్ రాయల్ పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. మోడర్న్ టచ్‌తో ఉన్న ఈ మోనోక్రోమ్ అవతార్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్ మనసులను కొల్లగొడుతున్నాయి..ఆ విశేషాలు చూద్దాం.. తాజా స్పెషల్ ఫోటోషూట్ కోసం రాశి ఖన్నా ప్రసిద్ధ స్టైలిస్ట్ షీఫా జే గిలానీ డిజైన్ చేసిన వైట్ బ్లేజర్ మిని డ్రెస్‌ను ఎంచుకుంది. ఇక ప్లంగింగ్ నెక్‌లైన్, స్ట్రక్చర్డ్ షోల్డర్స్‌తో ఉన్న ఈ వైట్ అవుట్‌ఫిట్‌లో రాశి ఎంతో ఎలిగంట్‌గా కనిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా సాఫ్ట్ రెట్రో వేవ్ బ్యాంగ్స్, వార్మ్ బ్లష్ టోన్స్, నూడ్ లిప్‌స్టిక్ జత చేసి ఆమె ఇచ్చిన రాయల్ లుక్ ఈ ఫోటోషూట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది సోషల్ మీడియాలో ఈ గ్లామరస్ పిక్స్ షేర్ చేస్తూ రాశి ఖన్నా "మీరు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తూ ఉన్న సమయంలో.." అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు "స్టన్నింగ్", "బ్యూటిఫుల్ ఐకాన్", "ఫ్యాషన్ క్వీన్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. వరుస విజయాలతో సక్సెస్ ట్రాక్: ఇక 'యోధ', 'అరన్మనై 4', 'ది సబర్మతి రిపోర్ట్' వంటి సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి విజయాలు అందుకుంది రాశి. నటిగా తనలోని వైవిధ్యాన్ని చూపుతూనే, మరోవైపు హెవీ ఫ్యాషన్ ఎడిటోరియల్ షూట్స్‌తో సౌత్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ టాప్ స్టైల్ ఐకాన్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

# రణబాలి నుంచి మెలోడీ సర్ప్రైజ్..



టాలీవుడ్ మోస్ట్ హిట్ పేయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి "ఏందయ్యా స్వామి" అనే బ్యూటిఫుల్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 1850ల కాలం నాటి పల్లెటూరి వాతావరణం, నూతన దంపతుల ముద్దుల అనుబంధాన్ని చాటే ఈ పాట వినగానే శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తోంది. ాశ్రీంశీ =ఘ౦ - నాని సినిమాల్లో ఇప్పటివరకు ఇలాంటి విలనే లేడా? రాయల్ మ్యాజిక్‌లా విజయ్-రష్మిక కెమిస్ట్రీ: 'రణబాలి' సినిమాలో విజయ్ దేవరకొండ రణబాలిగా, రష్మిక మందన్న జయమ్మగా నటిస్తున్నారు. ఈ "ఏందయ్యా స్వామి" పాట వీరిద్దరి పెళ్లి వేడుక నేపథ్యంతో పాటు నూతన దంపతుల మధ్య ఉండే అమాయకమైన ప్రేమను, సాన్నిహిత్యాన్ని ఎంతో అందంగా చూపుతోంది. ఇక 19వ శతాబ్దపు తెలుగు సాంప్రదాయ పెళ్లి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన తీరు, వారిద్దరి మధ్య ఉన్న హిట్ కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అజయ్-అతుల్ దివ్యమైన సంగీతం: ఈ పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అందించిన స్వరాలు ప్రధాన బలం. పల్లెటూరి జానపద శైలి, ఆధునిక మెలోడీ ట్యూన్స్ కలబోతగా రూపొందిన ఈ పాట వినగానే రిపీట్ మోడ్‌లో పెట్టుకునేలా ఉంది. శ్వేతా మోహన్, అజయ్ గోగావాలే తమ తియ్యని గొంతుతో ఈ మెలోడీకి ప్రాణం పోయగా, సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం నూతన దంపతుల అనురాగాన్ని ఎంతో చక్కగా ఆవిష్కరించింది. ఈ పాట పూర్తి స్థాయిలో విడుదలకాక ముందే, దీనికి సంబంధించిన చిన్న వెడ్డింగ్ ప్రోమో సోషల్ మీడియాను ఊపేసింది. ఇప్పుడు ఫుల్ లిరికల్ సాంగ్ రావడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. విజువల్ గ్రాండియర్, ఎమోషనల్ స్టోరీ టెల్లింగ్, అద్భుతమైన మ్యూజిక్ కలగలిసి ఈ పాటను ఒక టైమ్‌లెస్ లవ్ యాంథమ్‌గా మార్చేశాయి. అక్టోబర్ 16న థియేటర్లలోకి రణబాలి: ఇప్పటికే "ఏందయ్యా స్వామి" పాటతో శ్రోతల మనసు దోచుకున్న 'రణబాలి' చిత్రంపై అంచనాలు తారస్థాయికి చేరాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఇక విజయ్-రష్మిక మ్యాజిక్ మళ్లీ రిపీట్ కావడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613